# ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు



సిద్దిపేట, అక్టోబర్ 1: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బతుకమ్మ పండుగ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అమావాస్య నుంచి తొమ్మిది రోజులు ఆడపడుచులు కలిసి ఆడే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. దేశంలోనే పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే పండుగ అన్నారు. అలాంటి సంస్కృతి తెలంగాణలో ఉందన్నారు.

నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, బుధవారం 2 అక్టోబర్ 2024 | SIDDIPET

# ముసుగుతో హడలెత్తించిన ఆకతాయి విద్యార్థిని

**ఆందోళనకు గురైన తల్లిదండ్రులు**

అమీన్‌పూర్ అక్టోబర్ 1: గుర్తుతెలియని విద్యార్థి ఆకతాయి చేష్టలతో కళాశాల విద్యార్థినులతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురై గందరగోళ పరిస్థితులు నెలకొన్న సంఘటన అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో శ్రీ చైతన్య కళాశాలతో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కళాశాల యాజమాన్యం, విద్యార్థినుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి వాణీనగర్ కాలనీలోని శ్రీచైతన్య కళాశాలలో సోమవారం రాత్రి గుర్తుతెలియని విద్యార్థిని ముసు గు వేసుకుని వచ్చి మరో విద్యార్థినిపై ఆకతాయి చేష్టలతో భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో మిగతా విద్యార్థినులు భయపడి వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కళాశాలకు చేరుకుని ఘటనపై యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఎవరో ఒకరిద్దరు విద్యార్థినులు ఆకతాయి చేష్టలు చేస్తూ కామెడీ చేయాలని చేసిన పని అది అని యాజమాన్యం తల్లిదండ్రులకు సర్ది చెప్పింది. కానీ, ఈ ఘటనలో ఒక విద్యార్థిని చెయ్యి విరిగిందని, ఆ విద్యార్థినిని తమకు చూపించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అలాంటిది ఏమిలేదని యాజమాన్యం చెప్పింది. ఈ విషయంపై తమకు ఎలాంటి సమాచారం లేదని, ఫిర్యాదు రాలేదని అమీన్‌పూర్ పోలీసులు తెలిపారు

# కేటీఆర్ కాన్వాయ్‌పై దాడి సిగ్గుచేటు

**నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



నారాయణఖేడ్, అక్టోబర్ 1: మూసి బాధితులకు భరోసానిచ్చేందుకు వెళ్తున్న మాజీమంత్రి కేటీఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో దాడుల సంస్కృతిని తెచ్చి సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను పక్కకు బెట్టి, బీఆర్‌ఎస్ నేతలపై దాడులకు దిగడం రేవంత్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, వారిని ప్రజలే తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్ నేతలపై దాడులు మానకుంటే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

# రూ.6వేల పింఛన్ అమలు చేయాలి



సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

**సిద్దిపేటలో దివ్యాంగుల నిరసన**

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 1: దివ్యాంగులకు దసరా పండుగ నుంచి రూ.6వేల చొప్పున పింఛన్ హామీని అమలు చేయాలని, లేదంటే సచివాలయాన్ని, గాంధీభవన్‌ను ముట్టడిస్తామని దివ్యాంగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కాంగ్రెస్ దివ్యాంగులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేటలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులను పట్టించుకోవడం లేదన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చి, ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు కుమార్, సురేశ్, పద్మారెడ్డి, నరసింహులు, లక్ష్మణ్, శ్రీనివాస్, సుధాకర్, అనిల్, మల్లేశం, శ్రీను, రాకేశ్, ఎల్లయ్య, దుర్గయ్య, అమృత్, రవితేజ, ప్రవీణ్, సోమయ్య, కనకచంద్రం, పోచయ్య, రాణి, మల్లవ్వ, సర్వ్వాప, భాగమ్మ పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ



మాట్లాడుతున్న కరాటే కల్యాణి, ఆనంద్ గౌడ్

కొమురవెల్లి, అక్టోబర్ 1: సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబాన్ని మంగళవారం బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ, బీజేపీ రాష్ట్ర ధార్మి క పరిషత్ జాయింట్ కన్వీనర్, ఫైర్‌బ్రాండ్ కరాటే కల్యాణి వేర్వేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. పోలీసులు గ్రామస్తులపైన కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ రఘునందన్‌రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కరాటే కల్యాణి మాట్లాడుతూ.. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో కొమురవెల్లి బీజేపీ మండలాధ్యక్షుడు బూర్గోజు నాగరాజు, బ్రహ్మండ్లపల్లి బాబు, గుబ్బ శ్రీను, అందే బీరయ్య, అశోక్, నర్సింహ పాల్గొన్నారు.

# నిప్పంటించిన నిందితుడి అరెస్టు



నిందితుడు రాంబాబు

అక్కన్నపేట, అక్టోబర్ 1: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని చౌటపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పుటించిన నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాత్రి చౌటపల్లిలోని బురుజు చౌరస్తా వద్ద ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి నిప్పు అంటించిన ఘటనపై బీఆర్‌ఎస్ నాయకులు అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ఎస్సై విజయభాస్కర్ దర్యాప్తులో భాగంగా గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. టెక్నాలజీని ఉపయోగించి గ్రామానికి చెందిన కామాద్రి రాంబాబును నిందితుడిగా గుర్తించి, అరెస్టు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా, తానే తెలంగాణ తల్లి విగ్రహం ముసుగు బట్టకు నిప్పు అంటించానని, దీంతో విగ్రహం పాక్షికంగా కాలిపోయిందని ఒప్పుకున్నాడు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# మానవ వ్యర్థాలతో ఎరువు తయారీ

**హుస్నాబాద్‌లో నేడు ఎఫ్‌ఎస్‌టీపీ ప్రారంభం**



హుస్నాబాద్‌లోని ఎల్లమ్మచెరువు సమీపంలో ప్రారంభానికి సిద్ధమైన ఎఫ్‌ఎస్‌టీపీ (ఇన్‌సెట్‌లో) మలాన్ని శుద్ధిచేసి నీరుగా మార్చే పాలీషింగ్ పాండ్

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 1: అందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో పర్యావరణానికి మేలు చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో హుస్నాబాద్‌లో మానవ మల వ్యర్థాలతో ఎరువు తయారీ కేంద్రం నిర్మాణం పూర్తయింది. బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బుధవారం ప్రారంభిస్తారు. బహిరంగ ప్రదేశాల్లో మానవ మలాన్ని పడేయడంతో ఎదురవుతున్న సమస్యలను దూరం చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మానవ మల వ్యర్థాల శుద్ధి బుధవారం నుంచి హుస్నాబాద్ పట్టణంలో మొదలు కానున్నది. హుస్నాబాద్ శివారులో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్‌ఎస్‌టీపీ)ను నిర్మించేందుకు టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.1.10 కోట్లను బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఎల్లమ్మచెరువు సమీపంలో ఎకరా స్థలంలో ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌లో ప్రహరీ, ఆపరేటర్ గది, శిక్షణ గది, అనరబిక్ స్టెబిలైజేషన్ రియాక్టర్, స్లడ్జ్ డ్రైయింగ్ బెడ్స్, బ్యాలెన్సింగ్ ట్యాంకు, ప్లాంటెడ్ గ్రావెల్ ఫిల్టర్, పాలిషింగ్‌పాండ్, అనరబిక్ బ్యాఫిల్ రియాక్టర్ తదితర పనులు చేపట్టారు. పట్టణంలో రోజువారీగా సేకరించిన పదివేల లీటర్ల మానవ వ్యర్థాలను వివిధ పద్ధతుల్లో శుద్ధిచేసి ఎరువును వ్యవసాయానికి ఉపయోగిస్తారు. మొక్కల పెంపకానికి వాడుతారు. హుస్నాబాద్‌లో ప్రారంభమవుతున్న ఎఫ్‌ఎస్‌టీపీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మూడేండ్లకు ఒకసారి తప్పనిసరిగా సెప్టిక్‌ట్యాంక్‌ను క్లీన్ చేసుకోవాలని హుస్నాబాద్ మున్సిపల్ ఏఈ పృథ్వీరాజు కోరారు.

# మహానగరం చెత్తకంపు మాకొద్దు !

- ఉమ్మడి రాష్ట్రంలోనే నల్లవల్లిలో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు బీజం
- అప్పటి ప్రభుత్వ ఆదేశాలతోనే 150 ఎకరాలను గుర్తించిన రెవెన్యూ శాఖ
- పదేండ్ల నుంచి డంపింగ్‌యార్డును అడ్డుకుంటున్న ప్రజలు
- కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఏర్పాటుకు మళ్లీ యత్నాలు
- వద్దని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న ప్రజలు, నాయకులు



గుమ్మడిదల: డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న నల్లవల్లి ప్యారానగర్ అటవీ ప్రాంతం

గుమ్మడిదల, అక్టోబర్ 1: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల ప్రాంతంలో ఒకప్పుడు వానపడితే మట్టి వాసన వచ్చేది. ఇదంతా గతం. ఇప్పుడు ఈ ప్రాంతంలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు కావడంతో రసాయనాల వ్యర్థాల వాసనలు వస్తున్నాయి. దీంతో ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారు. ఇది చాలదన్నట్లు ఇప్పుడు వీరిపై మరో పిడుగుపడేందుకు రంగం సిద్ధమవుతున్నది. దీంతో గుమ్మడిదల మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారి భయానికి, ఆందోళనకు కారణం డంపింగ్ యార్డు. హైదరాబాద్ మహానగరంలో పోగయ్యే చెత్తను గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో 152 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సర్కారు ప్రయత్నాలు సాగిస్తోంది. దీంతో ఇప్పటికే బతుకుభారంగా బతుకుతున్న తాము చెత్తకంపుతో ఊర్లు ఖాళీ చేసి వెళ్లక తప్పదని మండలవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గుమ్మడిదల మండలంలో ఉన్న 13 గ్రామాల ప్రజలు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ కూరగాయల పంటలతో పాటు వరి, మక్క, శనగ తదితర పంటలను సాగు చేస్తారు. పండించిన కూరగాయలను హైదరాబాద్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. పశుసంపద అధికంగా ఉండడంతో పాలు, పెరుగు వంటివి మహానగరానికి తరలించి విక్రయిస్తారు. ఇక్కడి గొల్లకుర్మలు గొర్రెలను, మేకలను మేపుతూ బతుకుదెరువు సాగిస్తారు. ఇక్కడి ప్రజలు స్వచ్ఛమైన గాలి పీలుస్తూ జీవనం సాగించగలుగుతున్నారు.

## ఉమ్మడి రాష్ట్రంలోనే డంపింగ్‌యార్డుకు బీజం

2013లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తికి అవసరమయ్యే వ్యర్థాలను వేయడానికి గుమ్మిడిదల మండలంలోని నల్లవల్లిలో పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో 152 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే డంపింగ్‌యార్డుకు తరలించాలని ప్రయత్నాలు కొనసాగాయి. 2015లో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు డంపింగ్‌యార్డు వద్దని సర్కారుకు విన్నవించారు. అప్పటి మంత్రి హరీశ్‌రావుకు జిల్లా పరిషత్ సమావేశంలో అప్పటి జడ్పీటీసీ చిన్నపాపని కుమార్‌గౌడ్ వేడుకున్నారు. డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మండలంలోని 13 గ్రామపంచాయతీలు ఏకగ్రీవ తీర్మానాలు చేసి సర్కారుకు పంపాయి. దీంతో పదేండ్ల పాటు ఊపిరి పీలుచుకున్నారు. ఇక డంపింగ్‌యార్డు ఏర్పాటు కాదని ధీమాగా ఉన్నారు. కానీ, రేవంత్ సర్కారు తిరిగి తెరపైకి డంపింగ్ యార్డు అంశాన్ని తెచ్చింది. అప్పట్లో డంపింగ్‌యార్డును వ్యతిరేకించిన నాయకులను ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ పిలిపించి డంపింగ్‌యార్డు కోసం సూచనలు చేశారు. జర్మనీ టెక్నాలజీతో డంపింగ్ యార్డు నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు వారికి తెలిపారు. కానీ, డంపింగ్‌యార్డు వద్దే వద్దని అన్నివర్గాలు మంత్రి దామోదరకు విన్నవించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు మండల నాయకులు తెలిపారు

## డంపింగ్‌యార్డుతో అన్నీ నష్టాలే..

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే డంపింగ్‌యార్డుతో హైదరాబాద్ చెత్తను తమ ప్రాంతానికి తరలిస్తే దుర్గంధం భరించలేమని, వాతావరణ కాలుష్యం జరిగే ప్రమాదం ఉందని మండల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుతో అటవీప్రాంతం దెబ్బతింటుందని, వానలు పడితే చెత్తాచెదారం, వ్యర్థాలు వరద రూపంలో చెక్‌డ్యామ్‌కు చేరి జీవవైవిధ్యానికి తీరని నష్టం జరుగుతుందని, వన్యప్రాణి సంరక్షణకు విఘాతం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సమీపంలోని చెరువులు, కుంటలు కలుషితమవుతాయని, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలోని రాయచెరువు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ఈ చెరువును ట్యాంక్‌బండ్ తరహాలో సుందరీకరణ చేస్తున్నారని, అలాంటి చెరువు కంపు వాసనతో పనికి రాకుండా పోతుందని నర్సాపూర్ మున్సిపాలిటీ కూడా డంపింగ్‌యార్డు వద్దని ఏకగ్రీవ తీర్మానం చేసింది.

### డంపింగ్‌యార్డు వద్దే వద్దు..



ప్యారానగర్‌లో డంపింగ్ యార్డు ప్రయత్నాలను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నాం. డంపింగ్‌యార్డు వద్దని మంత్రి దామోదర్ రాజనర్సింహకు, ఎంపీ రఘునందన్‌రావుకు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి ఇటీవల వినతిపత్రాలు అందజేశాం. అఖిలపక్షం ఆధ్వర్యంలో అన్నిపార్టీల నాయకులందరం కలిసి డంపింగ్‌యార్డు ఏర్పాటును అడ్డుకుంటాం. ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు ఉద్యమిస్తాం.

– కుమార్ గౌడ్ మాజీ జడ్పీటీసీ, గుమ్మడిదల

### తీవ్ర నష్టం జరుగుతుంది...



డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. ప్రజల బతుకులు ఆగం కాకుండా చూడాలి. వ్యవసాయం, పాడి, గొర్రె,మేకలను నమ్ముకున్న పాడి రైతులను ఆగం చేయకండి. పచ్చని అడవిలో కారుచిచ్చులా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలనుకుంటే మరో ఉద్యమమే వస్తుంది. తీవ్ర నష్టం చేకూర్చే డంపింగ్ యార్డు ఏర్పాటును సర్కారు విరమించుకోవాలి.

–గోవర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు, గుమ్మడిదల

# ఖబడ్దార్ మైనంపల్లి



సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేట, అక్టోబర్ 1: మల్కాజిగిరిలో ప్రజలు మైనంపల్లి హన్మంతరావును తిరస్కరించడంతో మతిస్థిమితం కోల్పోయి ఎమ్మెల్యే హరీశ్‌రావుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తగినశాస్తి తప్పదని సిద్దిపేట బీఆర్‌ఎస్ నాయకులు కుంబాల ఎల్లారెడ్డి, కోల రమేశ్‌గౌడ్, మేర్గు మహేశ్ హెచ్చరించారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ.. తొగుటలో మైనంపల్లి హన్మంతరావు హరీశ్‌రావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మల్లన్నసాగర్ నిర్మించి కేసీఆర్, హరీశ్‌రావు బీడు భూములను సస్యశ్యామలం చేశారన్నారు. మంత్రి పదవి కోసం ఇష్టం వచ్చినట్లు కేసీఆర్, హరీశ్‌రావులపై మాట్లాడితే నాలుక చీరేస్తామన్నారు. సిద్దిపేటకు వచ్చి రౌడీయిజం చేస్తానంటే కుదరదని, సిద్దిపేటకు మైనంపల్లికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి దృష్టిలో పడాలనే ఆకాంక్షంతో అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదన్నారు. నగర బహిష్కరణకు గురైన రౌడీషీటర్ మైనంపల్లికి హరీశ్‌రావును విమర్శించే స్థాయి లేదన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని, హైడ్రా బాధితులకు హరీశ్‌రావు అండగా నిలవడంతో ప్రభుత్వంలో వణుకు పుట్టిందని ఎద్దేవా చేశారు. మల్లన్న సాగర్‌కు వచ్చి బురద రాజకీయం చేసే బదులు, బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలని హితవు పలికారు. మైనంపల్లి తన తీరును మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కీసర పాపయ్య, ఆంజనేయులురెడ్డి యాదగిరి, సామల్ల సాయిప్రేమ్, ఆకుబత్తిని రాము, లింగం, ప్రశాంత్ ముదిరాజ్, నాగరాజు, దేవరాజు, గుజ్జరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.




## బాధిత బాలికకు పునరావాసం ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి, అక్టోబర్ 1: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో బాలికపై లైంగికదాడి ఘటనపై హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ స్పందించారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధతో ఆయన ఫోన్‌లో మాట్లాడి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత బాలికకు పునరావాస ఏర్పాట్లు చేయాలని, బాలికను కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో చదువుకునేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి నిందితుడు షార్పొద్దీన్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు. బాలిక ఉన్నత చదువుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయకు పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు.

# ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు వివరాలు సేకరించాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

మెదక్(నమస్తే తెలంగాణ),/సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 1: ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలని కలెక్టర్లకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై మంగళవారం కలెక్టర్లతో మంత్రి, సీఎస్ శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈనెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, ఒక గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలన్నారు. ఈనెల 8వ తేదీ వరకు ఇది పూర్తి చేయాలని, 9న స్క్రూట్నీ ,10న రిపోర్టు సబ్మిషన్ ఉంటుందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు నింబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు జయచంద్రారెడ్డి, రమాదేవి, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సచివాలయం నుంచి పాల్గొనగా, జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీపీవో సాయిబాబా, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఒక్కేసి పువ్వేసి చందమామ...



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలను తీసుకొస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగను మంగళవారం సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి, ఆడిపాడి సందడి చేశారు. ప్రసాదాలు, నైవేద్యాలు సమర్పించారు. ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలు నిర్వహించుకునే బతుకమ్మ పండుగకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 1



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఫెస్టివల్‌లో పిండి వంటలు చూపిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సిద్దిపేట డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సిద్దిపేట డిగ్రీ కళాశాలలో బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు